# 2

# మనం దేవుని సేవించడం ఎందుకు?

## (యోబు 4-12)

మన బాధలన్నీ పాపమునకు కలిగే శిక్షయేనా? దేవునికి నమ్మకముగా ఉండడంలో విఫలమైనందువల్ల యోబుకు బాధలు కలిగాయని అతని స్నేహితులు నమ్మారు. పరిశుద్ధుడును, ప్రేమమయుడునైన దేవునికి అప్పగింపబడిన జీవితానికి తగినట్టుగా యోబు యొక్క శ్రమానుభవములేదని వారు భావించారు. యోబు పూర్ణంగా దేవునికి నమ్మకస్థుడుగా ఉండియున్నట్టయితే, యోబు మీదికి ఆలాటి విపత్తు రావడానికి ఆయన సమ్మతించేవాడు కాదని వారి అభిప్రాయం.

## యోబు "స్నేహితుల" హితవు

**ఎలీఫజు హెచ్చరిక, యోబు సమాధానం (4-7)**

వారు యిరుకులలో పడినప్పుడు యితరులకు ఎలీఫజు ఏ సలహాలిస్తూ ఉండేవాడో ఆలాటి హితవును యోబు అంగీకరించనందుకు ఎలీఫజు అతని గద్దించాడు (4:3-6). "జ్ఞాపకము చేసికొనుము, నిరపరాధియైన యొకడు ఎప్పుడైన నశించెనా? యథార్థవర్తనులు ఎక్కడైన నిర్మూలమైరా?" అని అతడు యోబును అడుగుతున్నాడు (4:7). "నేను చూచినంతవరకు అక్రమమును దున్ని కీడును విత్తువారు దానినే కోయుదురు" అని అతడు తెలిపాడు (4:8).

అట్టి విపత్తు తనకు ఎందుకు సంభవించినదో యోబుకు యింకను తెలియకుంది. ఎందుకంటె ఎలీఫజు వర్ణించిన జీవితంలాంటిది తాను జీవించలేదు. 6, 7 అధ్యాయాలలో అతడు యింకను మరణాన్నే కోరుతున్నాడు. ఎలీఫజుకు గ్రహింపు అయినట్టు అతడు భావించడం లేదు (6:15). విషయాన్ని గ్రహించడానికి సహాయపడుడని యోబు తన స్నేహితులను అడుగుతున్నట్టున్నాడు. తాను తప్పు చేసియున్నట్టయితే అది ఎక్కడ జరిగిందో చూపుమని అతడు తన స్నేహితులకు సవాలును విసురుతున్నట్టున్నాడు (6:24). మాటలవలన ఏ ప్రయోజనం లేకుండపోతుంది. అతని బాధనుండి తప్పించడం గాని, అతని వేదనను తగ్గించడానికి గాని యోబు స్నేహితులవలన కుదరలేదు. కలలతో తన్ను భయపెట్టే ఎలీఫజు ప్రయత్నాలను అతడు తిప్పికొట్టాడు (7:14). "తమ్ము సృజించిన వాని సన్నిధిని నరులు పవిత్రులగుదురా? దేవుని సన్నిధిని మర్త్యులు నీతిమంతు లగుదురా?" అంటూ ఎలీఫజు కలలో ఒక ఆత్మ చెప్పిన భయపెట్టే సంగతిని ఎలీఫజు తెలిపాడు (4:17). దానితో యోబు ఒప్పింపబడలేదు. దేవుని యెడల ఎంత భక్తిగా

ఉండాలని తాను తెలుసుకున్నాడో అంత భక్తిగా యోబు ఉన్నాడు. ఒకవేళ అదే సమస్యయై ఉంటే–దేవుడు అతని అతిక్రమములను ఎందుకు క్షమించలేదో యోబు తెలిసికోగోరాడు (7:21).

## బిల్దదు సలహా, యోబు సమాధానం (8–10)

బిల్దదు కూడ ఎలాంటి సహాయమూ చేయలేకపోయాడు. యోబు సమస్యలు అతని పాపములకు శిక్షయే అని అతడు కూడ భావించాడు. యోబు నిజంగా నీతిమంతుడై ఉండినట్లయితే, అతడు పిలిచినప్పుడు దేవుడు ఆలకించియుండేవాడే అనేది అతని యోచన. యోబు పిలిచినా దేవుడు పలుకకపోవడానికి కారణం, దేవుడు తన్ను దూరంచేసుకొనే ఘోరమైన పాపం యోబు చేసే ఉండాలనేది అతని వాదన. యోబు దేవుని మరచియుండవచ్చుననేది అతని తలంపు (8:13). “ఆలోచించుము దేవుడు యథార్థవంతుని త్రోసివేయడు, ఆయన దుష్కార్యములు చేయువారిని నిలువబెట్టడు” (8:20) అని అతడంటాడు. బిల్దదు ప్రకారం, యోబు ఏదో లోపంగలవాడై యుండాలి లేకుంటే అట్టి సంగతులు అతనికి సంభవించేవి కావు. దేవునియందు విశ్వాసముంచుమని అతడు యోబును కోరాడు. దేవుని మరచువారందరు సాలెపురుగు పట్టువలె సులభముగా పాడగుదురు (8:14, 15).

ప్రార్థించ వీలులేనంత భయంకరముగా దేవుని శక్తియున్నట్టు యోబు చూచాడు. మహిమలను కలవాడైన దేవుడు మానవమాత్రుని సమస్యలను ఎందుకు గుర్తించాలనేది యోబు ప్రశ్నయై ఉంది. యోబు అంచనాలో, అతడు లోపములేనివాడైనా, దేవుని దృష్టిని పొందడానికి తాను అపాత్రుడే. ఆయన దృష్టిలో ఏ నరుడును నిజముగా మంచివాడుగా ఉండలేడని అతడు గ్రహించాడు. బిల్దదు దేవుని గొప్పతనాన్ని గూర్చి యిచ్చిన వర్ణన లేఖనాల్లో బహు గంభీరమైనదై ఉంది (8:2–22).

ఇంకను యోబు తికమకపడుతున్నాడు (10:15). అతడు పరిపూర్ణుడు కాడు – ఆ సంగతి అతనికి తెలుసు – కాని స్నేహితులు అతడు దుష్టుడని నిందలు వేస్తున్నట్టుగా అతడు నేరం చేయలేదు.

## జోఫరు నేరారోపణ, యోబు యొక్క జవాబు (11; 12)

తక్కిన స్నేహితులు చేసినదానికంటెను జోఫరు యొక్క నేరారోపణలు ఎక్కువ క్రూరంగా ఉన్నాయి. “వదరుబోతు వ్యాజ్యెము న్యాయమని ఎంచదగునా?” అని అతడన్నాడు. “ఎవడును నిన్ను అపహసింపకుండగనే నీవు హాస్యము చేయుదువా?” దేవుడే యోబుతో మాటలాడి అతని పాప స్థితిని అతనికి తెలియజేసిన బాగుండునని అతడు కోరుకున్నాడు. తాను పడవలసిన దానికంటె తక్కువగానే దేవుడు అతని బాధిస్తున్నట్టు జోఫర్ అన్నాడు (11:6)! దేవుడు సర్వశక్తుడనియు – కేవలము పరిశీలనవలన కనుగొనుటకు అతీతుడనియు అతడు అభిప్రాయపడ్డాడు. ఆయన ఏ నరునినైనా బాధించినట్టయితే, దానికి తగిన కారణముంటుంది. యోబు దేవుని వద్దకు మరలినట్టయితే, అతనిని సమస్త శోకమునుండి విడిపిస్తాడని జోఫరు నొక్కి చెప్పాడు.

యోబు జోఫరు కిచ్చే జవాబులో ఎత్తిపొడుపు (పరిహాసపు) మాటలున్నాయి: "నిజముగా లోకములో మీరే జనులు, మీతోనే జ్ఞానము గతించిపోవును" (12:2). యోబు కూడ కొన్ని సంగతులు ఎరిగినవాడే. అతని జ్ఞానం వారి జ్ఞానంకంటె తక్కువైనదేమీ కాదు. వారు చెప్పేదానిలో కొంత సత్యమున్నదని అతనికి తెలుసు, కాని తన్ను వారు గద్దించడంలో న్యాయంగా ఉండలేదని అతని విశ్వాసం. తాను యథార్థవర్తనుడును, న్యాయవంతుడునై ఉన్నప్పటికి తన్ను గేలి చేస్తూ అపహసిస్తున్నట్టు అతడు భావించాడు.

దేవుని గూర్చి అతనికి తెలియని సంగతులేవియు తన స్నేహితులు యోబునకు తెలుపలేదు. జంతువులు, పక్షులు, చేపలు కూడ దేవుని గూర్చి తన స్నేహితులకు బోధించగలవని యోబు అంటాడు: "... వీటి అన్నిటిని బట్టి యోచించుకొనినయెడల యెహోవా హస్తము వాటిని కలుగజేసెనని తెలిసికొనలేనివాడెవడు? జీవరాసుల ప్రాణమును మనుష్యులందరి ఆత్మలును ఆయన వశముననున్నవి గదా" (12:7-10). సమస్తమును దేవుని వశములోనున్నట్టు యోబు గుర్తించాడు, కాని తాను ఎందుకు శ్రమ అనుభవిస్తున్నాడో ఆ సంగతి అతనికి బయలుపరచలేదు.

## శ్రమ శిక్షయా అనే ప్రశ్న

యోబు ముగ్గురు స్నేహితులు నిజమే పలికారా? యోబు నేరస్థుడైనందుకు బాధననుభవిస్తున్నాడా? పాపమునకు శిక్షగా భూమిమీద కఠినమైన బాధలు మనకు కలుగుతాయా? అలాగైనట్టయితే, నీతిమంతులకంటె దుష్టులు ఎందుకు ఎక్కువగా శ్రమపరచబడుట లేదు?

ఒకవిధంగా చెప్పాలంటే, శ్రమ అంతా పాప ఫలితమే. మానవాళి సమస్యయే పాపం. తమ పాపమునకు ఫలితంగా ఆదాము హవ్వలు చాల బాధలననుభవించారు (ఆది. 3). ప్రత్యేకంగా వచ్చే కష్టాలు మనం చేసిన నిర్దిష్టమైన పాపమువలన వచ్చినవి కావు.

కొన్నిసార్లు మనం కష్టాలను తెచ్చి పెట్టుకుంటాం. దేవుని చట్టాలను అతిక్రమించినప్పుడు ఫలితాలు వస్తాయి. ఇది ప్రకృతి పరిధిలోను ఆత్మ సంబంధమైన పరిధిలోను నిజమే. భూ ఆకర్షణ శక్తి అనే దేవుని ప్రకృతి చట్టాన్ని మనం ఎరుగుదుము. ఆ చట్టాన్ని అతిక్రమించినవారు బాధననుభవిస్తారు (ఫలితాలననుభవిస్తారు). నిప్పు, నీరుకు సంబంధించిన దేవుని చట్టాలను మనం గౌరవిస్తాం-లేదా ఫలితాలతో బాధింపబడతాం. దేవుని ఆజ్ఞనుండి పారిపోయిన యోనా తనపైకి ఉపద్రవాన్ని తెచ్చుకున్నాడు (యోనా 1:2). తమ శిబిరములలోని పాపాన్నిబట్టి హాయి వద్ద ఇశ్రాయేలువారు పరాజితులయ్యారు (యెహోషువ 7:11, 12).

మరికొన్నిసార్లు యితరులవలన మనకు బాధలు కలుగుతాయి. హేబెలు మరణం తన అన్నయైన కయీను పాపంవలన తేబడింది (ఆది. 4). తాను ఉత్తమమైనదానిని ఆచరించి కూడ బాధననుభవించాడు "ఈలాటి అన్యాయాన్ని దేవుడు ఆపలేడా? ఆయన ఎందుకు ఆపడు?" అన్నట్టు మనం కొన్నిసార్లు శోధింపబడతాం "ఆయన ఎందుకు ఆపాలి? ఆయన అలా చేస్తే అంతకంటె ఎక్కువ నమ్మకంగా ఆయనను సేవించబోతామా?

ఇంతకు మించి ఆయనను ఎక్కువగా మనం ప్రేమించగలుగుతామా?" అని కూడ మనం అడుగవచ్చు.

దేవుని సంకల్పంలో, యితరులకు సహాయపడునట్లు బాధలు మన మీదికి అనుమతింపబడవచ్చు. ఇశ్రాయేలు జనాంగమంతటికి సహాయపడునట్లు, యోసేపు బాధలననుభవించునట్లు దేవుడు అనుమతించాడు (ఆది. 37-50). మనలను రక్షించడానికి ప్రభువైన యేసు శ్రమపొందారు. దేవుని సేవకులలో గొప్పవారందరు యితరుల మేలుకొరకు కొంతకాలం శ్రమలు అనుభవించినట్టు చూడగలం. సువార్త పక్షముగా అపొస్తలుడైన పౌలు అనేక హింసలననుభవించాడు (2 కొరింథీ. 4:7-18). "ఎవడైనను క్రైస్తవుడైనందుకు బాధ అనుభవించినయెడల అతడు సిగ్గుపడక, ఆ పేరును బట్టియే దేవుని మహిమపరచవలెను" అని పేతురు అన్నాడు (1 పేతురు 4:16).

"ప్రభువు తాను ప్రేమించువారిని శిక్షించి తాను స్వీకరించు ప్రతి కుమారుని దండించును" అని క్రొత్తనిబంధన బోధిస్తుంది (హెబ్రీ. 12:6). "తన పరిశుద్ధతలో పాలుపొందవలెనని మన మేలుకొరకే ఆయన శిక్షించుచున్నాడు" అనియు అది వివరిస్తుంది (హెబ్రీ. 12:10). అట్టి సందర్భంలో దానిని సహించడం కష్టంగా ఉన్నా, దాని అంతంలో "అది నీతియను సమాధానకరమైన ఫలమిచ్చును." "దేవుడు గద్దించు మనుష్యుడు ధన్యుడు కాబట్టి సర్వశక్తుడగు దేవుని శిక్షను తృణీకరింపకుము" (5:17) అని ఎలీఫజు మాటలు (యోబు విషయములో కాకపోయినను) సహజంగా అవి సరియైన మాటలే-(యోబు విషయములో అవి అప్రస్తుతం).

## తొందరకలగడం సార్వత్రికం

తొందరలు కలగడానికి మనం అతీతులం కాదు. "స్త్రీ కనిన నరుడు కొద్ది దినములవాడై మిక్కిలి బాధనొందును" (14:1) అని యోబే అన్నాడు. సమస్త సంకటాలకు అతీతంగా దేవుడు మనలను లేవనెత్తడు. కాని వాటితో సర్దుబాటు చేసికొనడానికి ఆయన సహాయం చేస్తాడు. ఆయన మనకు ఇంద్రియ నిగ్రహముగల ఆత్మనే యిచ్చెను గాని పిరికితనముగల ఆత్మను యివ్వలేదు (2 తిమోతి 1:7). ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా మనకు అత్యధిక విజయమును ప్రసాదిస్తాడు (1 కొరింథీ. 15:57). మనలను బలపరచువానియందు మనం సమస్తము చేయగలం (ఫిలిప్పీ. 4:13).

దేవుని సేవించినంత మాత్రాన బాధలు మనలను విడిపోవు. యోబు ముగ్గురు స్నేహితుల ఆలోచనలో ఈ విషయంలో భావ లోపముంది. దేవునికి నమ్మకంగా ఉండియుంటే, తాను అనుభవించే శ్రమలను యోబు అనుభవించకపోయేవాడే అనేది వారి విశ్వాసం. యోబు దేవుని వెదకి, తన స్థితిని ఆయనకప్పగించుకున్నట్టయితే, సమస్తము చక్కబడతాయనేది ఎలీఫజు యొక్క ఆలోచన (5:8, 17-27). దేవుడు అతని విడిపించి, మరణంనుండి అతని విమోచించి, నాశనమౌతాననే అతని భయాన్ని తొలిగించి, శాంతిని ఆయన అతనికి తెస్తాడని ఎలీఫజు యోబుకు అభయమిచ్చాడు. కోత సమయమువరకు నిలిచియుండు గింజవలె తన నిండు జీవితాన్ని అనుభవించిన మీదటనే యోబు సమాధికి చేరుకుంటాడని అతడు వాగ్దానం చేస్తాడు.

నీతిమంతులకు ఆలాటి దీవెనయే వస్తుందని జోఫర్ అన్నాడు (11:15-19). యోబుకు సంభవించిన దానినంతటిని అతని స్నేహితులు తప్పుగా వ్యాఖ్యానిస్తున్నారు. ఆ సంగతి యోబుకు తెలుస్తుంది. నీతిమంతులు సహితం శ్రమలు అనుభవిస్తారని యోబు ఎరుగును.

వాస్తవానికి, మనం నీతిగా ఉన్నందుకే పలుమార్లు శ్రమననుభవిస్తాం. తాను తప్పు చేసినందుకు కాదు, తప్పుచేయనందుకే యోబు శ్రమలను సహిస్తున్నాడు. కొంత శ్రమలో సాతాను హస్తము లేకుండ పోలేదు. యోబును బాధించడానికి వాడు ప్రత్యేకంగా కోరుకున్నాడు. అందుమూలంగా అతనిని దేవునినుండి దూరంచేయాలనేది వాని కృత నిశ్చయమైయుంది. మేలుచేసి బాధననుభవించేవారిని పేతురు ప్రోత్సహించాడు: "తప్పిదమునకై దెబ్బలు తినినప్పుడు మీరు సహించినయెడల మీకేమి ఘనము? మేలు చేసి బాధ అనుభవించినప్పుడు మీరు సహించినయెడల అది దేవునికి హితమగును; ఇందుకు మీరు పిలువబడితిరి" (1 పేతురు 2:20). దేవునికి నమ్మకత్వాన్ని ప్రదర్శించినప్పుడు మోషేకు బాధలు కలిగాయి. "అల్పకాలము పాపభోగము అనుభ వించుటకంటె దేవుని ప్రజలతో శ్రమ అనుభవించుట మేలని" మోషే తలంచినప్పుడు బాధలు ఎదురయ్యాయి (హెబ్రీ. 11:25). మేలు చేయ నిశ్చయించుకున్నందున అనేకమంది ప్రవక్తలేమి, సువార్తికులేమి శ్రమలననుభవించారు.

## దేవుని సేవించుటకు హేతువు

"దేవుని సేవించుట ఎందుకు?" అనే ప్రశ్నకు యోబు గ్రంథం బదులివ్వచూస్తుంది. దేవుడు అతని దీవించినందున యోబు దేవుని సేవిస్తున్నాడనేది సాతాను ఫిర్యాదు. తన యందు భయభక్తులు కలిగియున్నందుననే యోబు ఆయనను సేవిస్తున్నట్టు దేవుడు నిరూపించగోరాడు.

"నీతిగా ఎందుకు ఉండాలి?" అనేదానికంటె "నీతిమంతులు ఎందుకు శ్రమ పెట్టబడతారు?" అనే ప్రశ్ననే యోబు గ్రంథం ఎక్కువగా చర్చిస్తుంది. కేవలం మనం పొందే దీవెనలను బట్టి దేవుని సేవిస్తామా లేక దేవునియందు భయభక్తులు కలిగి యున్నందున ఆయనను సేవిస్తామా? బాధలనుండి విడుదల పొందవలెనని కనిపెట్టుతూ మనమాయనను సేవించినయెడల మనము భ్రమపడువారమై ఉందుము. పందెపు రంగములో ప్రవేశింపగోరి తర్ఫీదుపొంద నిరాకరించడం ఎలాటిదో దేవుని సేవింపగోరి ఏవిధమైన బాధలు లేకుండ ఉండాలని కోరడం కూడ అట్టిదే. గొప్ప పరుగు పందానికి ఒకడు సంతకం పెట్టినప్పుడు, పందెములోని బాధ సంగతి ప్రక్కన ఉంచి, భయంకరమైన తర్ఫీదు ఆ తరువాత ప్రాక్టిస్‌ను ఎంతగానో అతడు ఎదురు చూడవలసి యుంటుంది.

మనం తప్పు ప్రశ్నను అడుగుతున్నాం "ప్రజలు ఎందుకు బాధననుభవిస్తారు?" అనేది ప్రశ్న కానే కాదు. ఎదో ఒక విధంగా ప్రజలందరు బాధలనుభవిస్తారు. పరీక్షలు అనివార్యములు. అవి మనకు ఏమి చేస్తాయి అనే మన స్వభావం మీద అవి తీర్మానించ బడతాయి. సూర్యుడు అందరిపైనను ప్రకాశిస్తాడు. ఇద్దరు వ్యక్తుల శరీర తత్వాన్ని బట్టి ఒకనికి దేహం కమిలిపోవచ్చు, మరొకనికి బొబ్బలు పొక్కవచ్చు. అలాగే, బాధలను

మనం ఎలా సర్దుకుపోతామనే దానిమీద కాక మన జీవన స్వభావం మీద ఆధారపడి యుంటుంది.

మన శ్రమలలో దేవుడు మనకు సహాయం చేస్తాడు, కాని వాటిని మన జీవితంలోనుండి తొలిగించడు. వాస్తవానికి, మనం దేవుని సేవించినప్పుడు, వేరు రకములైన శోధనలలో సయితం పడవచ్చు. బాధలను చూచే మన దృష్టి విధానాన్ని దేవుడు మార్చగలడు. మన పరిస్థితులు మనలను వశపరచుకునే దానికంటెను పరిస్థితులనే మనం వశపరచుకునేలా ఆయన మనకు సహాయము చేయగలడు.

ఆయన మనకు ఏమి చేస్తాడో దానిని బట్టి గాక, ఆయన నిజంగా ఏమైయున్నాడో దానినిబట్టి దేవుని మనం ప్రేమించి ఆయనను సేవించ నేర్చుకోవాలి. దేవుని సేవ బహుమానాలు దీవెనలు కలిగి ఉన్నాయి; కాని మనం ఆయనను సేవించడంలో ఏమి పొందగలమో వాటికొరకు మాత్రమే మనమాయనను సేవించినట్టయితే, మనం దాన్ని చూచినప్పుడు అది మనకు దీవెనగా కన్పించదు. ఉదాహరణకు, ప్రభువైన యేసు యిలా అన్నారు: “పుచ్చుకొనుట కంటె యిచ్చుట ధన్యత” (అపొ. 20:35). పొందుటకే మనము సేవ చేసినట్టయితే, ఇచ్చుటలో ఉండే దీవెనను మనం ఎరుగం. మనం ఆయనయందు భయభక్తులు కలిగియున్నందున ఆయనను సేవించినప్పుడు, కష్టాలలో కూడ మనమాయన దీవెనలను చూడగలం.

## ముగింపు

మేలు పొందడానికి కాదు, మేలు చేయడానికి గాను మనం దేవుని సేవింప నేర్చుకోవాలి. మనం మంచివారముగా ఉండాలి మనకు మంచి చేయబడాలనే ఉద్దేశంతో కాదు. ఆనందదాయకమైన జీవితాల్లో మహా గొప్ప సంతోష సమయాలు శోధనలపై కలిగిన విజయాలలోను, ఆటంకాలను అధిరోహించడాలలోను, దుఃఖ సముద్రంలో నిరాశలో మునిగిపోయినవారిని వారి కన్నీళ్లు ఆరిపోయి, ఆశామేఘాలు కురిసేంతవరకు వారికి తోడుగా ఉండి, బాధను పంచుకోవాలి.